క్లుప్తంగా

యేసుక్రీస్తు చూపిన బాటలో పయనిద్దాం



తెనాలిఅర్బన్: యేసు క్రీస్తు చూపిన బాటలో అంతా నడవాలని రక్షణ సైన్యం సంస్థ ప్రతినిధి మేజర్ వి యేసుపాదం పేర్కొన్నారు. రక్షణ సైన్యం చర్చి నాల్గవ వార్షికోత్సవ వేడుకలను అయితానగర్‌లోని చర్చి ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రక్షణ సైన్యం సంస్థ ద్వారా భారత దేశంలోని అనేక ప్రాంతాలలో దేవుని సేవ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆయనను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. తదనంతరం సంఘస్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేజర్ పి నాగరాజు, సంఘ కాపరి మేజర్ పి రత్న సుందరి, సంఘ పెద్దలు బట్టు జక్రయ్య, గాలి రవి, పిల్లి కనక్రత్నం, కారుమంచి నరసింహరావు, రుద్రపాటి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

తెనాలి ఎంపీడీవోగా శిల్ప బాధ్యతల స్వీకరణ



తెనాలిటౌన్: తెనాలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.శిల్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా కంచకచర్ల మండల ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ ఏవో ప్రతాపరెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

కొల్లిపర ఎంపీడీవోగా విష్ణు బాధ్యతల స్వీకారం



కొల్లిపర: కొల్లిపర ఎంపీడీవోగా బి.వై విష్ణుప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా రెడ్డిగూడెం మండలం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో వి.విజయలక్ష్మి ప్రకాశం జిల్లా చీరాల మండలం బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన విష్ణుప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఆయనను కలసి అభినందనలు తెలిపారు.

ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి



తెనాలి అర్బన్: రైల్వేలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 5,696 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్‌ను కేంద్రం విడుదల చేయటం బాధాకరమని రివల్యూషనరీ యూత్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆర్‌వైఏ ఆధ్వర్యంలో గురువారం గాంధీ చౌక్‌లో ఖాళీసేపు అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అన్ని శాఖలలో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌వైఏ జాతీయ కమిటీ సభ్యులు ఉదయ్ కిరణ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ప్లాట్‌ఫాం మీద మృతదేహం ఉందన్న సమాచారంతో జీఆర్పీ పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతి చెందిపడి ఉన్నాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న మెగా లోక్ అదాలత్

రేపల్లె రూరల్: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు న్యాయశాఖ నిర్వహిస్తున్న మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమై కక్షిదారులకు న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కోర్టుభవన్‌లో గురువారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 9న శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పండుటాకులకు ఆసరా పింఛన్లు పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. పట్టణంలోని 40 వార్డుల పరిధిలో వార్డు వాలంటీర్‌లు ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పింఛన్‌ను పంపిణీ చేశారు. మంచం మీద నుంచి లేవలేని అవ్వాతాతల వద్దకు వాలంటీర్లు వెళ్లి వారికి పింఛను సొమ్మును అందజేశారు. అయితానగర్‌కు చెందిన పాముల సౌభాగ్యంకు వాలంటీర్ నరసింహారావు, లింగారావు సెంటర్ వద్ద కన్నెబోయిన నాగమ్మకు వాలంటీర్ వంపుగళ్ళ సరిత, చెంచుపేటకు చెందిన నాగమోతు కోటేశ్వరమ్మకు వాలంటీర్ గంటెల రమాదేవి వృద్ధాప్య పింఛన్‌లను పంపిణీ చేశారు.



నాగమ్మకు వృద్ధాప్యపు పింఛను అందిస్తున్న వాలంటీర్ సరిత



కోటేశ్వరమ్మకు వృద్ధాప్యపు పింఛను అందజేస్తున్న వాలంటీర్ రమాదేవి

అభివృద్ధి పనుల పరిశీలన

- తెనాలి ప్రాంత అభివృద్ధికి కృషి
- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మారీసుపేటలో గురువారం ఉదయం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలపై నాపరాళ్లు ఏర్పాటు చేయటం వల్ల పూడికతీత పనులు చేయలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. మురుగు కాల్వలు బాగు చేసేందుకు అనువుగా వాటిని ఉంచాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ తోట రఘురామ్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ తదితరులున్నారు.



పుడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

డిప్యూటీ ఎస్‌వో భానుశ్రీ

గనికపూడి (ప్రత్తిపాడు): రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్‌వో) భానుశ్రీ తెలిపారు. మండల పరిధిలోని గనికపూడిలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం గనికపూడి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఏఎన్‌ఎం నిర్వహించాల్సిన పన్నెండు రకాల రిజిస్టర్ల నిర్వహణతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. యాంటినేటల్ గృహాలను సందర్శించి హెచ్‌బీ పరీక్షలు చేసి, రికార్డుల్లో ఉన్న విధంగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తనిఖీ చేసి ఏఎన్‌ఎం పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణతో పాటు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కూడా సకాలంలో సక్రమంగా పూర్తి చేయాలని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. అదేవిధంగా గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో విధులను నిర్వర్తించాలని చెప్పారు. డీపీహెచ్‌ఎన్ శాంతకుమారి, గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్, సిబ్బంది సైమన్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం తదితరులున్నారు.



గనికపూడిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం

మిరాకిల్' జ్యూరీ మెంబర్‌గా రత్నాకర్

తెనాలి: మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా తెనాలికి చెందిన కనపర్తి రత్నాకర్ నియమితులయ్యారు. గతంలో మ్యాన్ ఆఫ్ ది మిరాకిల్, ఆంధ్రావాలా బిరుదులు పొందిన రత్నాకర్‌ను జ్యూరీ మెంబర్‌గా నియమిస్తూ జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ తిమ్మిరి రవీంద్ర గురువారం నియామక పత్రాన్ని పంపారు. సహజకవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, దేవిశెట్టి కృష్ణారావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ తదితరులు రత్నాకర్‌ను అభినందించారు.

ఇసుక లారీ సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గుర్తించి సీజ్ చేశారు. తెనాలి పట్టణంలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం సిబ్బందితో కలిసి గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎటువంటి బిల్లులు లేకుండా 30 టన్నుల ఇసుకను తరలిస్తున్న లారీని గుర్తించారు. సరైన పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి తెనాలి త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పల్లెకోన మాజీ సర్పంచ్ రాయన ప్రసాద్ నియమితులయ్యారు. గురువారం నియామకపు పత్రాన్ని భట్టిప్రోలు మండలం ఐలవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాపట్ల రవి కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఈడే శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు మద్దిబోయిన తాతయ్యలు పాల్గొన్నారు. ప్రసాద్ నియామకం పట్ల బీసీ నాయకులు యరగళ్ల సాంబశివరావు, కూరపాటి రఘురామయ్య, జొన్నాదుల రమేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుంటూరు ఈస్ట్: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన ఎం.తిరుమలరావు అప్పుల బాధ భరించలేక గురువారం జెడ్పీ కాంపౌండ్ సమీపంలో పురుగు మందుతాగాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్ సహాయంతో జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లచెరువుకు చెందిన షేక్ ఇమ్రాన్ (29) అప్పుల బాధ భరించలేక జనవరి 26న కేవీ కాలనీలోని ఖాళీ స్థలంలో పురుగు మందు తాగాడు. అనంతరం విషయాన్ని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగికి సేవలతోనే గుర్తింపు

తెనాలిరూరల్: పోలీసు వృత్తి బాధ్యతాయుతమైనదని క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని తెనాలి త్రీటౌన్, టూటౌన్ సీఐలు సన్నిబోయిన రమేష్, అద్దంకి సుధాకర్‌లు పేర్కొన్నారు. స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పని చేసి, బుధవారం ఉద్యోగ విరమణ పొందిన వాకా రామకోటేశ్వరరావు అభినందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను అంకిత భావంతో పూర్తి చేసేవారని గుర్తు చేశారు. సమయపాలనలో రాజీ పడే మనస్తత్వం కాదని విధి నిర్వహణలో ఎప్పుడూ ముందుండే వారని చెప్పారు. 40 ఏళ్లుగా పోలీసు శాఖలో ఎటువంటి అభియోగాలు లేకుండా పనిచేయడం వృత్తిపై ఆయనకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, ఎన్. ప్రకాశరావు, ఏఎస్‌ఐలు దేవప్రసాద్, బి.రమేష్ బాబు, హైదర్ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.



రామకోటేశ్వరరావును అభినందిస్తున్న సీఐలు, సహచర సిబ్బంది

సేవలతోనే ఉద్యోగి జీవితం సార్థకం

ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ శాఖలో విశేష కృషిచేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. గురువారం పదవీ విరమణ చేసిన ముగ్గురు సిబ్బందిని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సన్మానించారు. సీఐగా విధులు చేపట్టిన కె.మహాలక్ష్మి, చీరాల ట్రాఫిక్ ఎస్ఐ డి.సోలోమాన్ రాజు, కారంచేడు ఏఎస్ఐ పి.శ్యామ్‌సుందర్‌లు పదవీ విరమణ చేశారు. వీరంతా సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో సేవలందించారు. వీరిని ఎస్పీ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి. మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎమ్‌డిహెచ్ ప్రేమ్ కుమార్, ఎస్‌బి సీఐ వి.మల్లికార్జున, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ

వింజనంపాడులో కిట్స్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవా శిబిరం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం విజంనంపాడులో కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు గురువారం సేవా శిబిరాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు జరగనున్న శిబిరాల్లో భాగంగా తొలి రోజు విద్యార్థులు పంట పొలాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. పంటల సాగు విధానం, పురుగు మందుల పిచికారీ, సేంద్రియ వ్యవసాయం, అధిక దిగుబడులకు సస్యరక్షణ పద్ధతులను తెలుసుకున్నారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందులను వినియోగించడం వలన భూసారం దెబ్బతింటుందని, ప్రతి ఏటా క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించి, పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. మొదటి రోజు శిబారాన్ని గ్రామ సర్పంచ్ ఎస్.నాగలక్ష్మి, ఎంపీటీసీ సుజాత, కార్యదర్శి పి.శివప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



పంటపొలాల్లో రైతులతో కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మంచాల యూపీ స్కూల్‌లో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

విద్యార్థులకు ట్యాబులు అందజేత

మంచాల(చేబ్రోలు): విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధనకు కృషి చేయాలని చేబ్రోలు మండలం మంచాల గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని మంచాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆయన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో సర్పంచ్ సొంత ఖర్చుతో చదువుల తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. హెచ్ఎం రత్నశేఖర్, అదిన లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబుల అందజేత

మంచాల యుపీ స్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు ట్యాబులను అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



చేబ్రోలు మండలం మంచాల యూపీ పాఠశాలలో ఆవిష్కరించిన సరస్వతీదేవి విగ్రహం

షుగర్, బీపీలపై శాస్త్రీయ అవగాహన అవసరం

గుంటూరు మెడికల్: ప్రస్తుతం బీపీ, షుగర్ బాధితుల సంఖ్య పెరిగిపోతోందని, ప్రతి ఒక్కరూ వీటిపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) వైద్యాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో డాక్టర్ తాతా సేవ కుమార్, డాక్టర్ పి.కోటేశ్వరరావు సంయుక్తంగా రచించిన 'డయాబెటిస్- హైపర్ టెన్షన్- తెలుసుకోవలసిన విషయాలు- తీసుకోవలసిన జాగ్రత్తలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో తాము జరిపిన సర్వేలో ప్రతి వంద మందిలో 22 మందికి మధుమేహం, 25 మందికి అధిక రక్తపోటు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ వైద్య సలహాలు, మందులు అందించామని చెప్పారు. అయితే అధిక బీపీ, షుగర్ వ్యాధులపై సరైన శాస్త్రీయ అవగాహన లేనందున, సక్రమంగా చికిత్స పొందకుండా ప్రమాదం ముంచుకొచ్చిన తర్వాత ఆసుపత్రుల్ని ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలోనే వైద్యుని సంప్రదించి, సక్రమంగా చికిత్స పొందడం ద్వారా వాటి నుంచి బయటపడవచ్చని చెప్పారు. డాక్టర్ సేవకుమార్, డాక్టర్ పి. కోటేశ్వరరావు తమ 30 సంవత్సరాల అనుభవాలతో రచించిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు ఈ పుస్తకం దిక్సూచిలా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంపు చైర్మన్ టి.ధనుంజయరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ బీపీ, షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ పి.కోటేశ్వరరావు, విశ్రాంత గ్రంథాలయ అధికారి జి.వి.ఎస్. ప్రసాద్, రచయిత, విశ్లేషకులు తూములూరి రాజేంద్రప్రసాద్, రమణబాబు, ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలారాణి, ఫార్మాసిస్ట్ మాలిని, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సేవకుమార్, డాక్టర్ కోటేశ్వరరావు

దామాషా ప్రాతిపదికన ముస్లింలకు సీట్లు కేటాయించాలి

పిట్టలవానిపాలెం: దామాషా ప్రకారం ముస్లింలకు రాష్ట్రంలో నాలుగు పార్లమెంట్ స్థానాలు, 15 అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని ముస్లిం ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షుడు షేక్ మౌలా బేగ్ డిమాండ్ చేశారు.మండలంలోని చందోలులో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ముస్లిం జూడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 7 నుంచి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజకీయ చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 12 జిల్లాల్లో జూడో యాత్ర పూర్తయిందని తెలిపారు. బాపట్ల జిల్లాలో తప్పని సరిగా ఒక అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంమలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర ప్రతినిధి ఖలీల్ సయ్యద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాజి, రాష్ట్ర ఉప కార్యదర్శి సయ్యద్ నూరు, జిల్లా అధికార ప్రతినిధి జిలాని, నియోజకవర్గ అధ్యక్షులు తాజ్, ఉపాధ్యక్షులు హుస్సేన్ బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

వైభవంగా వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు

తెనాలిటౌన్: పట్టణ హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం సంయుక్త ఆధ్వర్యంలో వెంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పూజ్య శ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో నాలుగోరోజు స్వామివారికి 450 కిలోల పులిహోరతో అన్నకూటి ఉత్సవం, తిరుప్పావడ సేవ జరిపారు. శ్రీవారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, కొలువు అర్చన, బాలభోగం, నవనీత హారతి, దివ్య ప్రబంధాలను వేదపండితులు జరిపారు. అన్నమాచార్య కీర్తనలు, టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు మహిళలు రెండు వేల మందితో కీర్తనలు ఆలపించారు. అన్నకూటి ఉత్సవంలో భాగంగా స్వామివారు బద్రినారాయణ స్వరూపంలో దర్శనమిచ్చారు. హైదరాబాద్ లలితపీఠం నిర్వాహకులు పూజ్యశ్రీ సంపూర్ణానంద గిరి స్వామి శ్రీనివాసుని విశిష్టతను భక్తులకు వివరించారు. రామాయణం విశిష్టతను చిదంబరశాస్త్రి తెలియజేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



ప్రవచనం చేస్తున్న సంపూర్ణానంద స్వామి

ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరానికి స్పందన

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి శిబిరంలో 281 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు వైద్యం అందించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత ఆదివాసి మేనిఫెస్టో విడుదల

నెహ్రూనగర్: రాష్ట్రంలో 25శాతంగా ఉన్న దళిత, ఆదివాసీల ఆకాంక్షల అక్షర రూపమే దళిత ఆదివాసి మేనిఫెస్టో -2024 అని దళిత బహుజన రిసోర్స్ సెంటర్స్ (డీబీఆర్‌సీ)కార్యదర్శి అల్లడి దేవ కుమార్ పేర్కొన్నారు. బ్రాడీపేటలో గురువారం మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో దళిత, ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి, సాధికారిత కోసం కృషి చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, సంస్థలతో సంప్రదింపులు జరిపి మేనిఫెస్టోను రూపొందించినట్లు చెప్పారు. రాష్ట్రంలో దళితులు, ఆదివాసులు, సంచార జాతులకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారం కోసం నిర్దిష్టమైన ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. మేనిఫెస్టోను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు గోళ్ల అరుణ్‌కుమార్, మురికిపూడి దేవపాల్, మేడిద బాబూరావు, మల్లెల చిన్నప్ప, జ్యోతి, కోటేశ్వర రావు, భగవాన్‌దాస్ పాల్గొన్నారు.



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న దేవకుమార్ తదితరులు

సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శన

వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని ఎంపీపీ యల్లమాటి మోహన్ ఆదేశించారు. వేమూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ .8 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి అప్పగించాలని నిర్మాణ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హరిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పొన్నూరు: ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ పేర్కొన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం పొన్నూరు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎల్ఈడీ డిస్‌ప్లే ద్వారా పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

చట్టసభల్లో కాపులకు ప్రాధాన్యం కల్పించాలి

పెదకాకాని: చట్టసభల్లో కాపులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రజా కాపునాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి నాగరాజు అన్నారు. పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామానికి చెందిన ఆయన జనవరి 27న జరిగిన సమావేశంలో గుంటూరు జిల్లా ప్రజా కాపునాడు అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చట్టసభల్లో కాపులకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. కాపులంతా ఐకమత్యంగా ఉండాలని, అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు. అనంతరం కొప్పురావూరు అడ్డరోడ్డులో ఉన్న లిటిల్‌సిస్టర్స్ ఆఫ్ ది పూర్ వయోవృద్ధుల ఆశ్రమంలో నిర్వాహకులు, వృద్ధులతోనూ మాట్లాడారు.